సాక్షి
జనగామ

శుక్రవారం | 30 | మే | 2025



సైబర్ ఎటాక్.. ఇక నో టెన్షన్

రుణయాప్ నిర్వాహకుల వేధింపులకు బలవుతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. సైబర్ దాడి నుంచి రక్షించుకునేందుకు ఓ వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. - 8లో▸



ఫిర్యాదులు.. ఇష్టానుసారంగా..

టీజీఎన్పీడీసీఎల్‌లో ఫిర్యాదుదారుడి పేరు, చిరునామా లేని ఆకాశరామన్న ఉత్తరాలు (ఫిర్యాదులు) ఉద్యోగులు, అధికారులను బెంబేలెత్తిస్తున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 /26^0

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నిరీక్షణకు తెర

జిల్లాలో 1,937 కొత్త రేషన్ కార్డులు

- పెరిగిన లబ్ధిదారులు 40,555 మంది
- వచ్చే నెల నుంచి సన్నబియ్యం
- ఆయా కుటుంబాల్లో సంతోషం

జనగామ: ప్రభుత్వ పథకం కావాలన్నా.. విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ పొందాలన్నా.. సర్కారు అందించే సన్న బియ్యం తీసుకోవాలన్నా.. తెల్ల రేషన్ కార్డు ముఖ్య భూమిక పోషిస్తున్నది. వివాహం అయిన తర్వాత ఉమ్మడి కుటుంబాల నుంచి వేరుగా కాపురం ఉన్నవారు కొందరైతే.. పిల్లలు జన్మించిన తర్వాత వారి పేర్లు నమోదు చేసుకునేందుకు మరికొన్ని కుటుంబాల వారు తెల్లరేషన్ కార్డుల కోసం ఐదేళ్లుగా నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వం 2020 సంవత్సరంలో చివరిసారిగా కొంత మందికి రేషన్ కార్డులు జారీ చేసి.. ఆ తర్వాత నిలిపివేసింది. మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకున్న వేలాది మంది నిరుపేదల ఎదురుచూపులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మోక్షం లభించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో పేద కుటుంబాల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 355 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 1,61,346 రేషన్ కార్డులు ఉండగా.. 4,77,755 మంది ప్రభుత్వం అందించే సబ్సిడీ బియ్యం పొందుతున్నారు. 2020 సంవత్సరం నుంచి ప్రస్తుతం వరకు దరఖాస్తు చేసుకున్న 1,937 మందికి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త తెల్లరేషన్ కార్డులు మంజూరు చేసింది. ఇందులో వ్యక్తిగతంగా 40,555 మంది లబ్ధిదారులకు సబ్సిడీ సన్న బియ్యం తీసుకునే అవకాశం వచ్చింది. దీంతో జిల్లాలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1,63,283కు పెరిగింది. ప్రస్తుతం మూడు నెలల బియ్యం కోటా ఒకేసారి విడుదల కావడంతో జూన్‌లో కార్డులు వచ్చే కొత్త కుటుంబాలకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సన్న బియ్యం వచ్చే అవకాశం ఉంది.

నిరంతర ప్రక్రియ

నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు పాత కార్డుల్లో పిల్లలు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు మీ–సేవా కేంద్రాల్లో నిరంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చు. రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు దరఖాస్తులను పరిశీలించాక అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తారు.

జిల్లాలో పెరిగిన రేషన్ కార్డుల వివరాలు ఇలా..



■ మండలం ■ మే ■ జూన్ ■ పెరిగిన కార్డులు

మండలం	మే	జూన్	పెరిగిన కార్డులు
బచ్చన్నపేట	13,045	13,050	05
చిల్పూరు	12,449	12,725	276
దేవరుప్పుల	12,636	12,835	199
స్టేషన్‌ఘన్‌పూర్	16,410	16,664	254
జనగామ రూరల్	11,090	12,111	202
జనగామ అర్బన్	12,123	12,421	298
కొడకండ్ల	9,425	9,437	12
లింగాలఘణపురం	11,674	11,714	40
నర్మెట	7,529	7,645	116
పాలకుర్తి	18,081	18,256	175
రఘునాథపల్లి	16,954	17,028	74
తరిగొప్పుల	5,910	6,055	145
జఫర్‌గఢ్	13,201	13,342	141
మొత్తం	1,61,346	1,63,283	1,937

ఏడేళ్లు నిరీక్షించాం..



ఏడేళ్ల క్రితం వివాహం అయింది. కొద్ది రోజుల తర్వాత తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. అప్పటి నుంచి ఎదురు చూస్తున్నం. ఇద్దరు పిల్లలు జన్మించారు. ప్రభుత్వం నుంచి అందించే సబ్సిడీ సరుకులకు ఇంతకాలం దూరంగానే ఉన్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు పిల్లలతో కలిపి మరోసారి రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. చాలా సంతోషంగా ఉంది.

- ఎడ్ల ప్రియాంక, చిన్నపెండ్యాల(చిల్పూరు)

కుటుంబంలో ముగ్గురం



మా కుటుంబంలో ముగ్గురు సభ్యులం. తెల్ల రేషన్ కార్డు కోసం నాలుగు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నం. ఇంతకాలం నిరీక్షణకు ఇప్పుడు తెరపడింది. కొత్త రేషన్ కార్డు మంజూరైంది. వచ్చే నెల నుంచి మాకు 18 కిలోల సన్న బియ్యం ఉచితంగా రానున్నాయి.

- ఎలుకపెల్లి బాబు, సాల్వాపూర్(బచ్చన్నపేట)

ఉమ్మడి ఫ్యామిలీ నుంచి వేరుగా..



ఉమ్మడి కుటుంబం నుంచి వేరుగా వచ్చిన తర్వాత ఫిబ్రవరి నెలలో కొత్త తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నం. భార్యా, భర్త, ఇద్దరు పిల్లల పేర్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా కొత్త కార్డు మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. మాకు 24 కిలోల బియ్యం వస్తాయి.

- కమ్మగాని దివ్య, పాలకుర్తి

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర అవతరణ వేడుకల సన్నాహక సమావేశంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ చేతన్ నితిన్‌తో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2వ తేదీన నిర్వహించే ఈ వేడుకల సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చూపించేందుకు ఆయా శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, వీటి నిర్వహణ బాధ్యతను విద్యాశాఖ తీసుకోవాలని చెప్పారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, బ్యాంకు లింకేజీ కింద అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ, పోలీసు కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని తెలిపారు. సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏఓ మన్సూర్, డీఈఓ భోజన్న, పౌరసరఫరాల అధికారి సరస్వతి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ వసంత, డీపీఓ స్వరూప, ఉద్యానవన అధికారి శ్రీధర్‌రావు, డీవైఎస్‌ఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన డీసీపీ, ఏసీపీ

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు..

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ చేతన్ నితిన్ పండేరీతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3 నుంచి 13 వరకు జరిగే టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేశామని, 74 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈఓ భోజన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జీసీడీఓ గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు త్వరగా చేపట్టాలి

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

జనగామ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో జనగామ రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులు త్వరగా చేపట్టాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే డీజీఎం ఉదయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన రైల్వేస్టేషన్ సుందరీరణ పనులను పరిశీలించారు. మొదటి విడత సుందరీకరణ పనులకు రూ.24.75 కోట్లు మంజూరైనా పనులు ఆలస్యం కావడంపై డీజీఎంను ఎంపీ అడగ్గా.. నవంబర్ నాటికి వందశాతం పనులు పూర్తి చేస్తామని వివరించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. అయితే.. రైల్వేస్టేషన్ ఆవరణలో గ్రీనరీకి ప్రాధాన్యత ఇవ్వాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రెండు ప్లాట్ ఫాంలపై వానరాలతో ప్రయాణికులకు ఇబ్బందులున్నాయని, సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డీజీఎంకు ఎంపీ సూచించారు.



రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులపై ఆరా తీస్తున్న ఎంపీ, కొమ్మూరి

న్యూస్‌రీల్

సోమేశ్వర ఆలయంలో ఆరుద్రోత్సవం



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆరుద్రోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. పంచ హారతులతో చేపట్టిన గర్భాలయ దీపోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్.శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, నాగరాజు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రఘునాథపల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా రైతులకు సూచించారు. గురువారం రఘునాథపల్లి, కంచనపల్లి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తేమను పరిశీలించారు. లారీల కొరత, మిల్లర్ల సమస్యలపై ఆరా తీశారు. టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కాంటాలు అయిన వెంటనే మిల్లులకు తరలించాలని చెప్పారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తహసీల్దార్ ఎండీ.మోహ్సిన్ ముజ్తబ, ఏపీఎం సారయ్య పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేయాలి



జనగామ: రాష్ట్ర ప్రభుత్వం పురపాలికల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేయాలని కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. మున్సిపాలిటీలో గురువారం మేనేజర్, ఆర్‌ఓ, ఆర్‌ఐ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యాక్షన్ ప్లాన్‌లో ఇంటింటికీ తడి పొడిచెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇంటి పరిసరాల్లో చెత్తను తొలగించడం, రోడ్డు పక్కన ఉన్న పొదలను క్లీన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజారోగ్య శాఖ నుంచి వైద్యుల ఆధ్వర్యాన డెంగీ, మలేరియా బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రత్యేక రాష్ట్రంతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి

దేవరుప్పుల : రాజకీయాలకు అతీతంగా సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి చెందిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం ఉదయం(అమెరికా కాలమానం ప్రకారం) డల్లాస్‌లో జూన్ 1న అమెరికాలో తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు విస్తృత ప్రచారంతోపాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వాన తెలంగాణ సాధనతోనే దగాపడిన రాష్ట్రంలో నీరు, విద్య, ఉద్యోగ కల్పనతోపాటు వ్యవసాయ రంగం పురోగతిని గణనీయంగా పెంచుకోగలిగామని చెప్పారు. సప్తసముద్రాలు దాటి స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమి కోసం ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఇలాంటి చారిత్రాత్మక అభివృద్ధికి దోహదపడిన బీఆర్‌ఎస్ పార్టీ 25 ఏళ్ల ఉత్సవాలకు ఎన్‌ఆర్‌ఐలు అధిక సంఖ్యలో హాజరై భవిష్యత్ కార్యాచరణకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఎర్రబెల్లితోపాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ నాయకులు దామోదర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.



అమెరికా దేశం డల్లాస్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో ఎర్రబెల్లి దయాకర్‌రావు

'విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం'

జనగామ రూరల్: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఉమాపతి భవనంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం ఆవిర్భావం నుంచి నేటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పోరాటాలు సాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ అంకుషావలి, బి.లక్ష్మయ్య, శ్రీరామ్, రాజారెడ్డి, శ్రీహరి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

మినీ స్టేడియంలో క్రీడా పోటీలు

జనగామ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 31, జూన్ 1 తేదీల్లో ఉద్యోగులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు యువజన, క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు తగ్ ఆఫ్ వార్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, షాట్‌పుట్, పురుషులకు తగ్ ఆఫ్ వార్, బ్యాడ్మింటన్(డబుల్స్), క్రికెట్, షాట్‌పుట్ పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు జూన్ 2న అతిథుల చేతులు మీదుగా ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేస్తామని, మరిన్ని వివరాలకు 9182552593 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'నకిలీ'పై ఉక్కుపాదం

ఎరువులు, విత్తనాలపై నిఘా ఉంచాలి

- ధాన్యం సేకరణలో దేశంలోనే మొదటి స్థానం
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాపై సమీక్ష
- పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, మేయర్ సుధారాణి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, రెండు జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

హన్మకొండ అర్బన్: నాసిరకం విత్తనాలు, ఎరువుల్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నాసిరకం విత్తనాలు, ఎరువులను ఉక్కుపాదంతో అరికట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా విక్రయించకుండా నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రాష్ట్రంలో అంచనాల కుమించి 160 శాతం ధాన్యం అధికంగా వచ్చిందని, దేశ వ్యాప్తంగా ధాన్యం సేకరణలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 85శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయడంపై అధికారులు, ప్రజాప్రతినిధులను మంత్రి అభినందించారు.

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్లు..

రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు ప్రతీస్థాయి వరకు పర్యవేక్షిస్తున్న పనులు ముందుకు సాగకపోవడంతో ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 6వ తేదీ నాటికి ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ప్రొసీడింగ్స్ అందజేయాలన్నారు. అత్యంత నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం కోసం అధికారులు పనిచేయాలన్నారు. ప్రతీ సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులను అర్హుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, రవాణా ఖర్చులు మాత్రం లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.

2వ తేదీన జీపీఓలకు నియామక పత్రాలు

గ్రామపాలన ఆఫీసర్లుగా ఉత్తీర్ణులైన వారికి జూన్ 2న నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రైతులు, భూమి ఉన్న వారిని ఇబ్బందులు పెట్టొద్దని, ఇబ్బంది పెడితే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి ఆగస్టు 15 నాటికి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.



సమావేశానికి హాజరైన కలెక్టర్లు అద్వైత్ కుమార్ సింగ్, రిజ్వాన్ బాషా షేక్, రాహుల్ శర్మ, టీఎస్ దివాకర తదితరులు

కమిటీలో రైతులకు చోటు: మంత్రి సురేఖ

నాసిరకం విత్తనాలు, ఎరువుల నియంత్రణకు ఏర్పాటు చేసిన కమిటీలో అధికారులతోపాటు రైతులను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు, రవాణా, చెల్లింపులు వంటి అంశాలపై మాట్లాడారు. సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, రిజ్వాన్ బాషా, టీఎస్ దివాకర, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, ఎస్పీలు, మేయర్ సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస పాల్గొన్నారు.

పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యుడిగా దయాకర్



గాదె దయాకర్

కేయూ క్యాంపస్: రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యుడిగా కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దయాకర్ రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర ఎన్విరాన్‌మెంటల్ ఎక్స్‌పర్ట్ అప్రైజర్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. గతంలో 15 ఏళ్లపాటు కాలుష్య నియంత్రణ మండలి హైదరాబాద్ జోనల్ మెంబర్‌గా ఉన్నారు. టాస్క్‌ఫోర్స్ సభ్యుడిగా పనిచేశారు. వరంగల్ ధర్మారానికి చెందిన దయాకర్ హనుమకొండలో స్థిరపడ్డారు. కేయూలో పలు పదవులు నిర్వర్తించారు.

దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బండారుపల్లి, వేలేరు, హసన్‌పర్తి, వంగర, నెక్కొండ, కొడకండ్ల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి, పాఠశాల హెచ్‌ఎం అశోక్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్, సంస్కృతం, గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్ సబ్జెక్టులు, కళాశాలలో గణితం, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించేందుకు ఆసక్తి, అర్హత ఉన్న వారు దరఖాస్తులను జూన్ 2 లోపు సమర్పించాలని సూచించారు. 3న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని చెప్పారు.

క్లుప్తంగా

రెవెన్యూ వసూళ్లు వందశాతం సాధించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: రెవెన్యూ వసూళ్లు వంద శాతం సాధించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం రాత్రి హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఎస్ఏఓలకు వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. డివిజన్, జిల్లా వారీగా ప్రగతి సమీక్షించారు. ప్రధానంగా రెవెన్యూ వసూళ్ల పై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి రెవెన్యూ వసూళ్ల వంద శాతం సాధించేలా ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్లాలని సూచించారు. విద్యుత్ చౌర్యం అరికట్టాలని చెప్పారు. రైతులు తమ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కేబుల్ ఆపరేటర్లు ఉపయోగించే విద్యుత్ స్తంభాలకు అద్దె వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే, కేబుల్ ఆపరేటర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి, స్తంభాల వెంట గుత్తులుగా ఉన్న కేబుళ్లతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, క్రమపద్ధతిలో తీగలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ వి. తిరుపతి రెడ్డి, 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలు పాల్గొన్నారు.

సైబర్ ఎటాక్.. ఇక నో టెన్షన్

ఫొటో మార్ఫింగ్ బెదిరింపు నుంచి రక్షణ పొందండిలా!

- రుణయాప్ వేధింపుల అడ్డుకట్టకో సైట్
- అవగాహన పెంచుకోవాలంటున్న పోలీసులు
- 2015 నుంచే అందుబాటులోకి..



కాజీపేట: లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక జనగామ జిల్లా చిల్పూరు మండలం లింగపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు పెళ్లైన నలభై రోజులకే ఆత్మహత్యకు ఒడిగట్టాడు. కేవలం రూ.2వేల కోసం భార్యభర్తల ఫొటోలను మార్ఫింగ్ చేసి బంధువులకు పంపడంతో మనస్తాపానికి గురై తనువు చాలించాడు.

మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ యువతి రూ. 15వేల రుణం తీర్చే క్రమంలో వేధింపులకు గురైంది. అవమానంగా భావించిన సదరు యువతి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఇలా.. ఇటీవల రుణయాప్ నిర్వాహకుల వేధింపులకు బలవుతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. ఈ విషయమై రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కేసులు నమోదవుతున్నాయి. బాధితుల్లో యువత, విద్యార్థులు, మహిళలే ఎక్కువ ఉంటున్నారు. పూర్తిగా చెల్లించినా బాకీ ఇంకా ఉందంటూ.. ఫొటోలు మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడుతుండడం సైబర్ కేటుగాళ్ల తెగింపునకు పరాకాష్టగా నిలుస్తోంది. దీంతో బాధితులు మనస్తాపానికి గురై ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు.. ఆ సైబర్ దాడి నుంచి రక్షించుకునేందుకు ఓ వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. దీనిపై అవగాహన పెంచుకుంటే ఏ సందర్భంలోనైనా ఉపయోగపడుతుందని పోలీసులు చెబుతున్నారు. ఆ వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పూర్తిగా సురక్షితం..

ఆ సైట్ పేరు..
www.sotpncii.org
అంతర్జాతీయంగా నిర్వహించే ఈ వెబ్‌సైట్ పూర్తిగా భద్రమని పోలీసులు చెబుతున్నారు. మనం అప్‌లోడ్ చేసిన ఫొటోలను డౌన్‌లోడ్ చేయడం, ఇతరులకు షేర్ చేయడం ఉండదు. డిజిటల్ ఫింగర్ ప్రింట్ తరహాలో.. మన చిత్రంతో ప్రత్యేక గుర్తింపు ఇస్తుంది. దీని ఆధారంగా సామాజిక మాధ్యమాల్లో మన చిత్రాలు అప్‌లోడ్ అయితే .. అధునాతన సాంకేతికత ఆధారంగా గుర్తించి వెంటనే తొలగిస్తుంది. 2015 లోనే అందుబాటులోకి వచ్చింది. ఈ సైట్ ఇప్పటి వరకు అంతర్జాతీయంగా రెండు లక్షల మందికి పైగా బాధితుల మార్ఫింగ్ చిత్రాలను తొలగించి వారికి వ్యక్తిగత రక్షణ కల్పించింది.

సైట్‌కు ఫిర్యాదు చేయొచ్చు..

మీ ఫొటోలతో అశ్లీల చిత్రాలు రూపొందించి ఎవరైనా బ్లాక్ మెయిల్ చేస్తుంటే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. ఇందు కోసం మీ సెల్‌ఫోన్‌కి వచ్చిన ఫొటోలను ఈ సైట్‌కు పంపాలి. ఇందులో తొమ్మిది రకాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ మేరకు వివరాలు నమోదవుతాయి. తర్వాత ఫొటోలు అప్‌లోడ్ చేస్తే వాటిపై సదరు సైట్ నిఘా పెడుతుంది. ఎవరైనా ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే వెంటనే గుర్తించి తొలగిస్తుంది. ఆ వివరాలను నోటిఫికేషన్ రూపంలో మీకు తెలియజేస్తుంది.

■ కాజీపేట మండలం మడికొండకు ఓ యువకుడు లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుని రికవరీ ఏజెంట్ల బారినపడ్డాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రూ.1.60 లక్షల మొత్తం చెల్లించారు. అయినా మరికొంత చెల్లించాలని డిమాండ్ చేసి.. ఫొటోలు మార్ఫింగ్ చేసి బెదిరించడంతో తెలివిగా ఫేస్‌బుక్, వాట్సాప్, సోషల్ మీడియా ఖాతాల నుంచి తప్పుకుని తన ఫోన్ హ్యాక్ అయ్యినట్లు ప్రకటించాడు

ఈ జాగ్రత్తలు మేలు..

సామాజిక మాధ్యమాల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఫొటోలను అప్‌లోడ్ చేయకపోవడమే మంచిదని..ఒక వేళ చేసినా ఇతరులకు వాటి యాక్సెస్ లేకుండా జాగ్రత్త వహించాలని చెబుతున్నారు. ప్రొఫైల్ చిత్రాలను ఇతరులకు డౌన్‌లోడ్ కాకుండా లాక్ వేయాలి. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే రిక్వెస్ట్‌లు, లింక్‌లను ఎట్టి పరిస్థితులలోనూ ఆమోదించొద్దు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం సురక్షితమని వివరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ఫొటోలు మార్ఫింగ్, రుణయాప్ వేధింపులు ఎదురైతే భయపడకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. తద్వారా వారికి అండగా నిలిచి .. అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. సైబర్ నేరగాళ్ల ఆట కట్టించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

\- పింగిళి ప్రశాంత్ రెడ్డి, ఏసీపీ, కాజీపేట

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే మెరుపు సమ్మె


టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

- టీఎస్ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలని చూస్తోందని, ఇదే జరిగితే దేశ వ్యాప్తంగా మెరుపు సమ్మెకు దిగుతామని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ హెచ్చరించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో కార్మికుల హక్కుల కాలరాసేలా పోరాటాలు, సమ్మె చేయకుండా రెగ్యులరైజేషన్ అమైండ్‌మెంట్ తీసుకురావడాన్ని నిరసిస్తూ అక్కడి విద్యుత్ ఉద్యోగులకు మద్దతుగా గురువారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే ప్రజలకు ఎక్కువ ఇబ్బందులుంటాయన్నారు. ఉద్యోగావకాశాలు పోతాయన్నారు. ప్రైవేట్ నిర్వాహకులను భరించలేమన్నారు. ఈ క్రమంలో ప్రజలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఎన్పీడీసీఎల్ బాధ్యుడు సామ్యా నాయక్ మాట్లాడుతూ ఉత్తర్ ప్రదేశ్ ఉద్యోగుల పట్ల అక్కడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఇక్కడ ధర్నా చేశామన్నారు. ఈ ధర్నాలో శ్రీకాంత్, వెంకటేశం, కుమారస్వామి, జానకీరాంరెడ్డి, మధుకర్, పి.మహేందర్ రెడ్డి, మచ్చిక బుచ్చయ్య గౌడ్, చిట్ల ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టాల కోసం ఫీజు చెల్లించేందుకు గడువు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం జూలై 7వ తేదీన నిర్వహించబోతున్నారు. ఈ నేపథ్యంలో 2020 జనవరి 1 నుంచి మే 31 2025 వరకు పీహెచ్‌డీ పొందిన ఆర్ట్స్, సోషల్ సైన్స్, సైన్స్, కామర్స్అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్, లా, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎడ్యుకేషన్ విభాగాల్లోని అభ్యర్థులు పట్టాల కోసం జూన్ 16వ తేదీ వరకు రూ. వెయ్యి చొప్పున ఫీజు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ తెలిపారు. ఆయా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూఆన్‌లైన్.కో ఇన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

గతంలో ఫీజు చెల్లించిన అభ్యర్థుల రసీదు, పీహెచ్‌డీ ప్రెస్‌నోట్ అప్‌లోడ్ చేయాలి

కేయూ 22వ స్నాతకోత్సవం 2022 ఆగస్టు 25న జరిగింది. అప్పట్లో 2020 జనవరి 1నుంచి 2022 ఆగస్టు17వరకు పీహెచ్‌డీ పట్టాల కోసం ఫీజు రూ. వెయ్యి చెల్లించిన అభ్యర్థులున్నారు. అయితే వీరికి ఆ స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేయలేదు.అందుకే ఆయా అభ్యర్థులకు ఈ 23స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేస్తారు. ఈ నేపథ్యంలో ఆయా అభ్యర్థులు ప్రస్తుతం కొత్తగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. అయితే ఆయా అభ్యర్థులు అప్పట్లో చెల్లించిన రూ. వెయ్యి రసీదు, పీహెచ్‌డీ పొందిన ప్రెస్‌నోట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూ ఆన్‌లైన్.కో.ఇన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆయా అభ్యర్థులను కోరారు.

టెంట్ సిటీలో దొంగలు పడ్డారు..

- 8 ఏసీ కాంప్రెషర్స్, 3 కూలర్లు, ఇతర విలువైన వస్తువుల అపహరణ


కాళేశ్వరంలో టెంట్‌సిటీ నిర్మాణాలు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26 వరకు జరిగిన సరస్వతీనది పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం 40 టెంట్‌సిటీ నిర్మాణాలు చేపట్టింది. సోమవారం పుష్కరాలు పూర్తి కావడంతో బుధవారం నుంచి టెంట్‌సిటీలోని ఏసీలు, ఫర్నిచర్, బెడ్స్ తదితర వస్తువులు తీసుకెళ్లడానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి టెంట్‌సిటీకి చెందిన 8 ఏసీ కాంప్రెషర్స్, 3 కూలర్లు, డార్మెటరీకి చెందిన 9 బెడ్స్, దిండు, బెడ్‌షీట్స్, డ్రెస్సింగ్ మిర్రర్లు, గ్రీన్ నెట్ బాండిల్, కుర్చీలు దుండగులు ఎత్తుకెళ్లారు. రెండు రోజులుగా ఆ ప్రాంతంలో ఎలాంటి బందోబస్తు లేకపోవడం, విద్యుత్ దీపాలు వెలుగకపోవడంతో దుండగులు రెక్కీ నిర్వహించి ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై సంబంధిత ఆలీఎలిమెంట్ ప్రైవేట్ సంస్థకు చెందిన నిర్వాహకులు కాళేశ్వరం పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

సైబర్ మోసం..

- రూ.3 లక్షలు కొల్లగొట్టిన కేటుగాళ్లు
- లబోదిబోమంటూ సైబర్ క్రైం విభాగానికి యువతి ఫిర్యాదు

కాళేశ్వరం: సైబర్ నేరగాళ్లు బరితెగించారు. పెట్టిన పెట్టుబడికి పదిరెట్ల ఆదాయం వస్తుందని నమ్మబలికి ఓ అమాయకురాలి ఫోన్‌కు వాట్సాప్ మెస్సేజ్ పంపి రూ. 3 లక్షలు కొల్లగొట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి తన ఫోన్‌కు వాట్సాప్‌లో వచ్చిన ఓ మెస్సేజ్‌కు ఆకర్షితురాలైంది. ఆ మెస్సేజ్ ఓపెన్ చేసి చూడగా వివరాలు కనిపించాయి. దీంతో వెంటనే సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాలో తన తల్లిదండ్రులు ధాన్యం అమ్మగా వచ్చిన రూ. 3 లక్షలు జమ చేసింది. అయితే ఎంతకీ డబ్బులు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు గమనించడంతో ఈ విషయం బయటకు వచ్చినట్లు తెలిసింది. ఈ లోపే మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు డ్రా చేసుకున్నట్లు సమాచారం. వెంటనే ఈ విషయాన్ని సదరు యువతి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయగా రూ. 25 వేలు హోల్డ్ చేసినట్లు అధికారులు తెలిపారు. సదరు అకౌంట్ పర్యవేక్షణలో ఉంచామని, ఇంకా ఏమైనా అమౌంట్ అందులో జమ అయితే ఆ మొత్తాన్ని కూడా హోల్డ్ చేయనున్నట్లు తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కర్రతో విద్యుత్ తీగలు కదిలిస్తుండగా..

- మెయిన్‌లైన్ నుంచి ఊడి మీదపడడంతో యువకుడు మృతి
- దస్తగిరిపల్లిలో ఘటన


లక్ష్మణ్ రెడ్డి(ఫైల్)

నల్లబెల్లి: కర్రతో విద్యుత్ తీగలు కదిలిస్తుండగా మూడు తీగల్లో (త్రీఫేస్) ఒకటి మెయిన్‌లైన్ నుంచి ఊడి మీదపడడంతో షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దస్తగిరిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మందాటి లక్ష్మణ్ రెడ్డి(18) ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. చదువుకుంటూనే వ్యవసాయ పనుల్లో కుటుంబ సభ్యులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం వ్యవసాయ భూమికి నీరు పారించడానికి వెళ్లాడు. విద్యుత్ మోటారు ఆన్ చేయగా నడవకపోవడంతో తీగలను కర్రతో కదిలిస్తున్నాడు. ఈ క్రమంలో మూడు తీగల్లో ఒకటి మెయిన్ లైన్ నుంచి ఊడి మీద పడడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమ్మాయితో చాటింగ్ ఎందుకన్నందుకు..

- భార్యపై భర్త రోకలిబండతో దాడి
- అత్త, భర్తపై ఫిర్యాదు.. కేసు నమోదు

ఖిలా వరంగల్: అమ్మాయితో చాటింగ్ ఏంటి అని మందలించినందుకు భార్యపై భర్త దుర్భాషలాడుతూ రోకలి బండతో దాడి చేశారు. ఈ ఘటన వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్‌తోటలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన బరిగెల ఆనందం, స్వాతి దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు. ఇటీవల ఓ అమ్మాయితో ఆనందం చాటింగ్ చేస్తూ వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు భార్య స్వాతికి అనుమానం వ్యక్తం వచ్చింది. గురువారం మరోసారి అమ్మాయితో ఆనందం చాటింగ్ చేస్తుండగా స్వాతి గమనించి నిలదీసింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆనందం.. భార్య స్వాతిని దుర్భాషలాడుతూ పక్కనే ఉన్న రోకలి బండతో తలపై మోదాడు. తలకు గాయమై రక్తస్రావం కాగా, ఆమె వెంటనే తన తమ్ముడు మాచర్ల శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పింది. అతను వచ్చి ఆమెను హుటాహుటిన ఎంజీఎం తరలించాడు. స్వాతిని కొట్టే సమయంలో అత్త తేజమ్మ తన కుమారుడికి సపోర్ట్ చేస్తూ తిట్టింది. బాధితురాలు స్వాతి ఫిర్యాదు మేరకు భర్త ఆనందం, అత్త తేజమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

ఫిర్యాదులు.. ఇష్టానుసారంగా

- విద్యుత్ ఉద్యోగులను బెంబేలెత్తిస్తున్న పేరులేని ఫిర్యాదులు
- ఫిర్యాదులపై అధికారుల స్పందనతో పెట్రేగిపోతున్న ఫిర్యాదుదారులు
- అనామక ఫిర్యాదులపై విచారణ చేపట్టొద్దని విజిలెన్స్ ఆదేశాలు..
- అయినా పట్టించుకోని కొందరు అధికారులు.. విచారణకు ఆదేశం
- ఇదే అదునుగా భావిస్తున్న ప్రత్యర్థులు
- విద్యుత్ ఉద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్న నిరసన



పరిధిలోని 16 సర్కిళ్లలో ఈ వింత పోకడలు ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి.

హన్మకొండ : టీజీఎన్పీడీసీఎల్‌లో ఫిర్యాదుదారుడి పేరు, చిరునామా లేని ఆకాశరామన్న ఉత్తరాలు (ఫిర్యాదులు) ఉద్యోగులు, అధికారులను బెంబేలెత్తిస్తున్నాయి. వివిధ ఫిర్యాదులపై అధికారుల తక్షణ స్పందనతో ఫిర్యాదుదారులు పెట్రేగిపోతున్నారు. ఇష్టానుసారంగా ఫిర్యాదులు చేస్తూ క్షణికానందం పొందుతున్నారు. దీంతో ఉద్యోగులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే అనామక (ఆకాశరామన్న), చిరునామా లేని ఫిర్యాదులను పరిశీలన, విచారణకు స్వీకరించాల్సిన అవసరం లేదని సెంట్రల్ విజిలెన్స్, స్టేట్ విజిలెన్స్ ఆదేశాలు స్పష్టంగా ఉన్నా.. కొందరు అధికారులు అత్యుత్సాహం చూపుతూ విచారణ చేపడుతున్నారు. ఇదే అదునుగా ఆకాశరామన్న ఉత్తరాలు రాసే వారు పెట్రేగిపోతున్నారని విద్యుత్ ఉద్యోగులు మండిపడుతున్నారు.

వ్యక్తిగత కక్షలు నేరుగా ఎదుర్కోలేక..

వ్యక్తిగత కక్షలు నేరుగా ఎదుర్కోలేక ఆకాశరామన్న ఉత్తరాలు, ఫిర్యాదులతో తమ కోపాన్ని తీర్చుకుంటున్నారనే ప్రచారం విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ఈ వింత పోకడలు ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి.

ప్రత్యర్థుల క్షణికానందం..

ప్రధానంగా యాజమాన్యం ప్రతీ అనామక ఫిర్యాదుపై స్పందించి విచారణ చేస్తుండడంతో పేరు, చిరునామా లేని ఫిర్యాదులు చేస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అంతే కాకుండా ఫిర్యాదుకు గురైన ఉద్యోగి, అధికారి పడుతున్న ఇబ్బందులను చూసి ప్రత్యర్థులు క్షణికానందం పొందుతున్నారు. విద్యుత్ ఉద్యోగులు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై మరొకరు ఆకాశరామన్న ఉత్తరాల పేరుతో ఫిర్యాదులు చేసుకోవడం పరిపాటిగా మారిందని విద్యుత్ ఉద్యోగులు వాపోయారు. ఇంత జరుగుతున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు చోద్యం చూస్తున్నాయే కాని, వీటిని అరికట్టేందుకు సంఘాల నాయకులు పూనుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెంట్రల్ విజిలెన్స్ ఆదేశాలు బేఖాతర్..

పేరు, చిరునామా లేకుండా వచ్చిన అనామక ఫిర్యాదులను పట్టించుకోవద్దని సెంట్రల్ విజి లెన్స్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పా టు కోర్టులు ఇచ్చిన తీర్పులను సైతం ఉదాహరించింది. చిత్తశుద్ధి, బాధ్యత, పారదర్శకంగా పని చేసే అధికారులపై కొందరు ఇలాంటి ఫిర్యాదులు చేసే అవకాశముందని, ఇలాంటి ఫిర్యాదులు విచారణకు స్వీకరించాల్సిన అవసరం లేదని తెలిపింది. అయినా అత్యుత్సాహం చూపుతున్న కొందరు అధికారులు దురుద్దేశంతో విచారణ చేపడుతున్నారని, తమను మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన యాజమాన్యం విచారణలకు ఆదేశిస్తుండడంతో ఫిర్యాదుదారులు పెట్రేగిపోతున్నారని ఉద్యోగులు తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం అనామక, ఆకాశరామన్న ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు లేకుండా, సెంట్రల్, స్టేట్ విజిలెన్స్ ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు కోరారు.

తప్పులు జరిగితే అప్పుడే ఎందుకు స్పందించరు?

అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వర్తించే సమయంలో కాకుండా రిటైర్మెంట్ ముందు ఆకాశరామన్న లేఖల ద్వారా ఫిర్యాదులు పంపుతుండడం సరికాదని పలు సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, ఉద్యోగులు పేర్కొంటున్నారు. తప్పులు జరిగితే అప్పుడే ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. ఒకరిపై మరొకరు ఉద్యోగ విరమణ సమయంలో ఫిర్యాదులు చేస్తే పరిస్థితులు ఎటు వైపు వెళ్తాయో ఆలోచించాలని ఆకాశరామన్న ఉత్తరాలు రాసే వారికి సూచిస్తున్నారు. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే ఏ ఉద్యోగి కూడా సంతోషంగా విరమణయ్యే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది మంచి సంప్రదాయం కాదని విద్యుత్ ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా సమీక్షలో ఎమ్మెల్యేలు, అధికారులు..

సమావేశంలో పాల్గొన్న డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల ఎస్పీలు కిరణ్‌ఖరే, సుధీర్‌రాంనాథ్ కేకన్, శబరీశ్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

\- హన్మకొండ అర్బన్

మేడిగడ్డ గేట్ వద్ద సెక్యూరిటీ గార్డ్‌పై దాడి


తీవ్రంగా గాయపడిన రవీందర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీ అవతలి మహారాష్ట్ర బార్డర్ వైపున గేట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డ్ రవీందర్‌పై మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. బుధవారం రాత్రి గేట్ తీయాలని ఒత్తిడి చేయడంతో తీయకపోవడంతో రవీందర్‌పై రాయితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సెక్యూరిటీ గార్డ్ తీవ్రంగా గాయపడడంతో మహదేవపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దాడి ఘటన అక్కడి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. దీని ఆధారంగానే దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ KU దబ్బాలు కెనాల్ నుండి 900 మీ॥దూ॥లో 80 ఫీ॥ రోడ్‌కు ప్లాట్స్ నాలా పర్మిషన్ విత్ రిజిస్ట్రేషన్ ప్లాట్స్, రెసిడెన్షియల్ జోన్, లోన్ సౌకర్యం, గ॥ రూ॥12000. 9182538110, 8341175144. [WA-7567]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సెల్: 7842279342. [WA-7566]

రెస్టారెంట్స్

■ హోటల్ విహార గ్రాండ్ NGO's కాలనీ రోడ్, హన్మకొండ, టిఫిన్స్, రెస్టారెంట్, ఐస్ క్రీమ్స్, లగ్జరి రూమ్స్. సంప్ర: 9966600413, 9966600418 [SCA25004322]

సర్టిఫికెట్స్ పోయినవి

■ YEKKALADEVI SHIVAKUMAR S/o. Y. Chandramouli, R/o. H.No. 1-3-89, Geetha Nagar Jangaon Town & Dist గార్లవి ఒరిజినల్ SSC మెమో & Degree Provisinal సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్ జనగాం బస్టాండ్ నుండి ఆటోలో గీతానగర్ మా ఇంటికి వస్తుండగా దారిలో పోయాయి. దొరికినవారు సంప్ర: 7306836766 [SCA25004322]

BUSINESS OFFER

■ Need Monthly Returns? Get International Capital Market Trading, Profit Sharing/Fixed Profit Safe & Secure. Ph : 9392151984 [SCA25004324]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

CHANGE OF NAME

■ I, NAGARAGANI BALAKRISHNA S/o GOPAI RAO, H.No: 2-40, Pangidipalli, Vill: Kamalapur, Mdl: Hanamakonda Dist, TG. I have changed my Daughter name from NAGARAGANI AVANTHIKA (old name) Aadhar card No. 373445188235) to NAGARAGANI SANVI KRISHNA (New name) for all futur purpose. [SCA25004340]

WANTED

■ అనుభవం గల 50 సం॥ల పైబడిన వయసుగల కార్ డ్రైవర్ కావలెను కాశిబుగ్గ, లేబర్ కాలనీ & వరంగల్ లోకల్ వారు మాత్రమే ఫోన్ చేయగలరు 7569605218 [SCA25004325]

■ Wanted telecallers in Education sector, Salary 10,000/-. Full Time & Part Time, 5,000/- Incentive are 10,000/- per Admission. Cont: 9908432153 & 9517961999 [WA-6590]

■ చికెన్ & చేప పచ్చడి రూ॥ 25/-, నాటుకోడి రూ॥ 30/-, మటన్ & రొయ్యలు రూ॥ 35/- ధర గల పొడులు కిరాణా & ఇతర షాపులకు తిరిగి అమ్ముటకు స్త్రీ/పు కావలెను. జీతి 3000/- వరకు ఆదాయం. మండలానికి ఒకరు మాత్రమే. 81439 09459. [SCA 25004310]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం TG No.1 Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పనిబేబికేర్‌కు M/F వర్కర్స్ కా॥భో+వసతి+జీతం 16-18 వేలు ఫోన్. 9133271122/ 9515119430 [SCA25004282]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.